# విశాల భారతి

28-01-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 26


## డిజిటల్ మార్కెట్లో విశాల భారతి ప్రత్యేక స్థానం

**స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఐఎఎస్ చేతుల మీదుగా విశాల భారతి క్యాలెండర్ ఆవిష్కరణ**




### భారత్-ఈయూ

## మదర్ ఆఫ్ ఆల్ డీల్స్

భారత్ చరిత్రలో 2026 జనవరి 27 ఒక సువర్ణ అధ్యాయం

- యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం
- ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేయనున్న పరిణామం
- అగ్రరాజ్యం అమెరికా సైతం ఆశ్చర్యపోయేలా చేస్తోంది
- ప్రధాని మోడీ, యూరోపియన్ ప్రతినిధులు సంతకాలు
- 18 ఏళ్ల పాటు సాగిన చర్చల అనంతరం ఈ భారీ ఒప్పందం



**విశాలభారతి, జాతీయం:**

భారతదేశ వాణిజ్య చరిత్రలో 2026 జనవరి 27 ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. దశాబ్దన్నర కాలానికి పైగా సాగిన నిరీక్షణకు తెరదించుతూ భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ప్రపంచ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చేసే ఈ పరిణామం అగ్రరాజ్యం అమెరికా సైతం ఆశ్చర్యపోయేలా చేస్తోంది. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, యూరోపియన్ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కేవలం రెండు ప్రాంతాల మధ్య వ్యాపార సంబంధాలకే పరిమితం కాకుండా భవిష్యత్తు తరాల అభివృద్ధికి ఒక దిక్సూచిగా మారబోతోంది. ఈ అరుదైన ఘట్టానికి సాక్ష్యంగా యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ , యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా స్వయంగా భారత్‌కు విచ్చేశారు. చర్చల సందర్భంగా ఆంటోనియో కోస్టాను ప్రధాని మోడీ 'లిస్బన్ గాంధీ' అని సంబోధించడం విశేషం. సుమారు 18 ఏళ్ల పాటు అనేక దఫాలుగా సాగిన చర్చల అనంతరం ఈ భారీ ఒప్పందం సాధ్యమైంది. దీని ద్వారా ఐరోపా ఖండంలోని 27 దేశాలతో భారత్ ఏకకాలంలో వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసుకుంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త జవజీవాలను అందిస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్ ఈ ఒప్పందంలో భాగంగా యూరోపియన్ దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులపై ఉన్న దిగుమతి సుంకాలను భారీగా తగ్గించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా రసాయన ఉత్పత్తులు, వైద్య పరికరాల రంగంలో ఉన్న టారిఫ్‌లు దాదాపుగా తొలగిపోనున్నాయి. శస్త్రచికిత్సకు వాడే అధునాతన యంత్రాలు, పరీక్షల పరికరాలపై 90 శాతం వరకు పన్ను మినహాయింపు లభించనుంది. దీనివల్ల దేశంలో వైద్య ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. అలాగే పారిశ్రామిక రంగానికి అవసరమైన

మిగతా 3లో..

### పురపోరుకు మోగిన

# నగారా..!

## తెలంగాణ పురపాలక రంగంలో ఎన్నికల నగారా మోగింది

- ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని షెడ్యూల్ విడుదల చేశారు
- రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది
- పట్టణాల్లో అసలైన రాజకీయ కోలాహలం మొదలైంది
- 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికలు
- ఈ నెల 30వ తేదీ సాయంత్రం లోపు నామినేషన్ల స్వీకరణ




**తెలంగాణ పురపాలక రంగంలో ఎన్నికల నగారా మోగడంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పట్టణాల్లో అసలైన రాజకీయ కోలాహలం మొదలైంది. దాదాపు 116 మున్సిపాలిటీలు, ఏడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం కావడంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు గెలుపు గుర్రాలుగా నిలిచేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని విడుదల చేసిన ఈ షెడ్యూల్ అటు పాలక పక్షానికి, ఇటు ప్రతిపక్షాలకు ఒక అగ్నిపరీక్షగా మారనుంది. పట్టణ ప్రాంతాల్లో నివసించే దాదాపు 52 లక్షల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ తీర్పును వెలువరించనున్నారు. ఈ భారీ ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా నగరాలు, పట్టణాల భవిష్యత్తును నిర్ణయించే అవకాశం పౌరులకు లభించింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన క్షణం నుంచే గల్లీ స్థాయి నాయకుల నుంచి రాష్ట్ర స్థాయి దిగ్గజాల వరకు అందరి దృష్టి మున్సిపల్ పోరుపైనే నెలకొంది. గత కొన్నాళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ పురపాలక ఎన్నికలు ఇప్పుడు అధికారికంగా ఖరారు కావడంతో రాజకీయ క్షేత్రంలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. తమ తమ వార్డుల్లో పట్టు నిలుపుకోవాలని నాయకులు ప్రయత్నిస్తుంటే, మెరుగైన సౌకర్యాలు కల్పించే వారికే పట్టం కట్టాలని ఓటర్లు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల వేడి బుధవారం నాటి నుంచే సరికొత్త స్థాయికి చేరుకోనుంది. జనవరి 28వ తేదీన ఉదయం ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియ అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించే తొలి అడుగుగా నిలవనుంది. కేవలం మూడు రోజుల పాటే నామినేషన్లకు గడువు ఉండటంతో ఆశావహులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పత్రాల సేకరణ, కుల మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాల తయారీలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం లోపు నామినేషన్ల స్వీకరణ ముగియనుండటంతో రాజకీయ కార్యాలయాలన్నీ సందడిగా మారాయి. టిక్కెట్ల కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న నేతల సంఖ్య పెరిగింది. నామినేషన్ల స్వీకరణ ముగిసిన వెంటనే అధికారులు వాటిని నిశితంగా పరిశీలించే పనిలో నిమగ్నమవుతారు. జనవరి 31న జరిగే ఈ స్క్రూటినీ ప్రక్రియలో అభ్యర్థుల అర్హతలను మరియు దాఖలు చేసిన పత్రాలలోని సాంకేతిక అంశాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఏ చిన్న పొరపాటు జరిగినా పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుందన్న భయం అభ్యర్థుల్లో నెలకొంది. అదే రోజు సాయంత్రానికి సరైన పత్రాలు సమర్పించిన వారి జాబితాను అధికారులు ప్రకటిస్తారు. దీంతో అసలు పోటీలో ఎవరు ఉండబోతున్నారనే ప్రాథమిక

మిగతా 2లో..

## రేవంత్‌కి ప్రధాన గూఢచారి సంతోష్

- బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారాల ప్రకంపనలు
- ఇప్పుడు బహిరంగంగా చర్చనీయాంశంగా మారాయి
- కవిత సంతోష్ రావుపై ఘాటు విమర్శలు గుప్పించారు
- కేసీఆర్‌ను ప్రజలకు దూరం చేసిన వ్యక్తి సంతోష్ అన్నారు
- పార్టీకి పునాది లాంటి నాయకులను దూరం చేశరని విమర్శలు
- చాలామందిని మానసిక వేదనకు గురిచేశారని పేర్కొన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా పెను ప్రకంపనలు రేగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు ఇప్పుడు బహిరంగంగా చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మాజీ ఎంపీ సంతోష్ రావుపై చేసిన తీవ్రస్థాయి ఆరోపణలు రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి.

మిగతా 2లో..

## అవినీతిపరులకే మద్దతు

- అధికార, ప్రతిపక్షాలు మధ్య పరస్పర విరుద్ధ వాదనలు
- సామాన్య ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి
- ఏది సత్యమో, ఏది అసత్యమో తేల్చుకోలేని స్థితిలో సామాన్యుడు
- ఫోన్ ట్యాపింగ్, సింగరేణి బొగ్గు కుంభకోణం ఇందుకు నిదర్శనం
- ఇద్దరు కాంగ్రెస్ మంత్రుల మధ్య పోటీ నెలకొందన్న వార్తలు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య విమర్శల యుద్ధం

03




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నేటి రాజకీయ ముఖచిత్రంపై ఒకే అంశంపై అధికార, ప్రతిపక్షాలు వినిపిస్తున్న పరస్పర విరుద్ధ వాదనలు సామాన్య ప్రజలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తున్నాయి. ఏది సత్యమో, ఏది అసత్యమో తేల్చుకోలేని స్థితిలో సామాన్యుడు కొట్టుమిట్టాడుతున్నాడన్నది కాదనలేని వాస్తవం. ప్రజాస్వామ్యంలో చర్చలు, విమర్శలు ఆరోగ్యకరమైనవే అయినా, అవి వ్యక్తిగత దూషణలు, రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను వక్రీకరించే స్థాయికి చేరడం ఆందోళన కలిగిస్తోంది.

## మేడారం మహా జాతరకు సర్వం సిద్ధం



- మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ప్రారంభం
- నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనుంది
- రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేసింది
- ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తుతున్నారు
- ముందస్తు మొక్కులు చెల్లించుకునే వారి సంఖ్య లక్షల్లో
- సారలమ్మ తల్లి గద్దెపైకి రాకతో మహా జాతర అంకురార్పణ

03



### నేటి నుంచి పార్లమెంట్

## సమావేశాలు

- కేంద్ర బడ్జెట్ సమావేశాలకు దేశ రాజధాని సిద్ధమైంది
- బడ్జెట్ సెషన్ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి
- ప్రజాస్వామ్యబద్ధంగా సాగేలా చూసేందుకు కేంద్రం ఇవాళ అఖిలపక్ష సమావేశం
- ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై లోతైన చర్చలు జరిగాయి
- బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది

03

### నారాయణ, శ్రీ చైతన్య

## కార్పొరేట్ దొంగలు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- ప్రస్తుతం విద్యా రంగంలో పెను సంచలనం రేపుతున్నాయి
- విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలన్నారు
- విద్యాసంస్థల్లో బోధన చేస్తున్న వారి అర్హతలపై ప్రశ్నించారు
- కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చేశాయి
- భారీగా ఫీజులు వసూలు చేస్తూ దోచుకుంటున్నారని విమర్శ




## సీఎం కోల్ మాఫియా నాయకుడు

- సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహార దుమారం
- కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు
- సీఎం కోల్ మాఫియా నాయకుడిగా వ్యవహరిస్తున్నారన్నారు
- సింగరేణిని అవినీతికి నిలయంగా మార్చేశారని ధ్వజమెత్తారు
- టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని కేటీఆర్ ఆరోపించారు
- చాలామందిని మానసిక వేదనకు గురిచేశారని పేర్కొన్నారు

02



# నారాయణ, శ్రీ చైతన్య కార్పొరేట్ దొంగలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు విద్యా రంగంలో పెను సంచలనానికి దారి తీశాయి. విద్య అనేది కేవలం వ్యాపార వస్తువుగా మారిపోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీపై ఆయన చేసిన విమర్శలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో సైతం హాట్ టాపిక్‌గా మారాయి. నల్లగొండ జిల్లా బొట్టుగూడలో తన కుమారుడు ప్రతీక్ స్మారకార్థం ఎనిమిది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడిన మాటలు విద్యార్థుల తల్లిదండ్రుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. సమాజంలో విద్య అనేది అత్యంత పవిత్రమైనదని, అయితే ప్రస్తుత రోజుల్లో కార్పొరేట్ శక్తులు దానిని ఒక లాభసాటి వ్యాపారంగా మార్చేశాయని మంత్రి ధ్వజమెత్తారు. తాను గనుక విద్యాశాఖ మంత్రిని అయితే రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను మూసివేయిస్తానని ఆయన కుండబద్దలు కొట్టారు. కేవలం మూడు గదుల్లో నడుస్తున్న పాఠశాలలు కూడా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేయడం దారుణమని ఆయన పేర్కొన్నారు. అడ్మిషన్ల సమయంలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తనకు భయం వేస్తోందని, సిఫార్సుల కోసం వచ్చే ఫోన్లతో సతమతమవుతున్నానని ఆయన తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు.



ఫీజుల విషయంలో కార్పొరేట్ యాజమాన్యాలు అనుసరిస్తున్న మాయాజాలాన్ని కూడా ఆయన బహిర్గతం చేశారు. సిఫార్సు చేసినప్పుడు లక్ష రూపాయలు తగ్గించినట్లు నటించి, అసలు ఫీజునే వసూలు చేస్తున్నారని విమర్శించారు. చట్ట ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన ఇరవై అయిదు శాతం ఉచిత సీట్లను ఏ ఒక్క కార్పొరేట్ సంస్థ అమలు చేయడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ క్రమంలోనే ఆయన ప్రైవేట్ విద్యా సంస్థలను దొంగలతో పోల్చడం చర్చనీయాంశమైంది. విద్యార్థుల భవిష్యత్తు కంటే లాభాలకే ఆ సంస్థలు ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మధ్య ఉన్న నాణ్యత వ్యత్యాసాన్ని వివరిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పీహెచ్‌డీలు చేసిన అత్యున్నత విద్యావంతులు బోధిస్తుంటే, కార్పొరేట్ స్కూళ్లలో కేవలం డిగ్రీ లేదా ఇంటర్ చదివిన వారు లెక్చరర్లుగా చలామణి అవుతున్నారని గుర్తు చేశారు. ఎక్కడా ఉద్యోగాలు దొరకని వారే ఈ ప్రైవేట్ కాలేజీల్లో చేరుతున్నారని, అటువంటి వారి వద్దకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఎందుకు పంపిస్తున్నారో అర్థం కావడం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బట్టీ చదువుల సంస్కృతి వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యల వైపు మళ్లుతున్నారని ఆయన ఆవేదన చెందారు. విద్యార్థులు కేవలం ర్యాంకుల కోసం కాకుండా, సమాజంలో గొప్ప స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో చదవాలని ఆయన ఆకాంక్షించారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి వినూత్న కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బొట్టుగూడలోని ప్రభుత్వ పాఠశాలను అన్ని హంగులతో, పూర్తి డిజిటల్ సౌకర్యాలతో తీర్చిదిద్దామని చెప్పారు. ఇక్కడ చదివే విద్యార్థులు రేపటి రోజున ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఎదిగి దేశానికి సేవ చేయాలనేదే తన చిరకాల వాంఛ అని ఆయన పేర్కొన్నారు. కేవలం మార్కులు సంపాదించడమే చదువు కాదని, ఒక గొప్ప ఆలోచనను పెంపొందించుకోవడమే అసలైన విద్య అని ఆయన అభిప్రాయపడ్డారు.

తన రాజకీయ భవిష్యత్తు గురించి కూడా ఆయన క్లారిటీ ఇచ్చారు. నల్లగొండ ప్రజలు తనపై చూపిన అభిమానానికి రుణపడి ఉంటానని, మున్సిపాలిటీని కార్పొరేషన్ స్థాయికి పెంచడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. కేంద్రం నుండి వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేసే విషయం తన ఉత్సాహంపై ఆధారపడి ఉంటుందని, ఒకవేళ రాజకీయాల నుండి తప్పుకున్నా తన కుమారుడి పేరు మీద కట్టిన పాఠశాలలో విద్యార్థులకు చదువు చెబుతూ జీవితాన్ని గడుపుతానని భావోద్వేగంతో చెప్పారు. పేద పిల్లల చదువు కోసం తాను ఎంతటి పోరాటానికైనా సిద్ధమని కోమటిరెడ్డి ప్రకటించారు. విద్యా వ్యవస్థలో మార్పు రావాలంటే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ఏకైక మార్గమని ఆయన నమ్ముతున్నారు. విద్య అనేది అందరికీ సమానంగా అందాలని, పేదరికం చదువుకు అడ్డుకా కూడదని ఆయన సూచించారు. సమాజం అభివృద్ధి చెందాలంటే యువత విద్యావంతులు కావాలని, అది కూడా నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను పొందాలని ఆయన కోరుకుంటున్నారు. తన సేవా కార్యక్రమాల ద్వారా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపడం తనకు అమితమైన తృప్తిని ఇస్తుందని ఆయన వివరించారు.

మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు కార్పొరేట్ విద్యా రంగంలో కలకలం సృష్టిస్తున్నాయి. ఫీజుల నియంత్రణ, విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందనే సంకేతాలను ఆయన ఇచ్చారు. కేవలం లాభాపేక్షతో నడిచే సంస్థలకు కాలం చెల్లిందని, ప్రభుత్వ విద్యను నమ్ముకోవడమే శ్రేయస్కరమని ఆయన పిలుపునిచ్చారు. చదువును ఒక వ్యాపారంగా మార్చిన వారందరికీ ఇది ఒక హెచ్చరిక లాంటిదని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తులో విద్యాశాఖలో ఎటువంటి విప్లవాత్మక మార్పులు వస్తాయో చూడాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల వైభవాన్ని తిరిగి తీసుకువస్తామని, అక్కడ చదివే ప్రతి బిడ్డ ఆణిముత్యంలా మెరవాలని ఆకాంక్షించారు. నిజాయితీగా బతకడం, పేదలకు సహాయం చేయడం తన తండ్రి నుంచి నేర్చుకున్నానని, అదే మార్గంలో తన జీవితాంతం పయనిస్తానని చెప్పారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విన్నవించారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే తన పట్టుదలను ఆయన మరోసారి చాటారు. తన కొడుకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కేవలం పాఠశాలల నిర్మాణమే కాకుండా, పేద విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్పొరేట్ మాయాజాలంలో చిక్కుకోకుండా, ప్రభుత్వ విద్యా సంస్థలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

# రేవంత్‌కి ప్రధాన గూఢచారి సంతోష్

**మొదటిపేజీ తరువాయి**

గంజాయి స్మగ్లర్ల దాడిలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం కవిత మాట్లాడిన మాటలు బీఆర్ఎస్ పార్టీలో మునుపెన్నడూ లేని విధంగా చర్చకు దారితీశాయి. కేసీఆర్ నాయకత్వంలోని పార్టీకి సంతోష్‌రావు చేసిన నష్టం అంతా ఇంతా కాదని ఆమె ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రజలకు, ముఖ్యంగా ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు దూరం కావడానికి ప్రధాన కారకుడు సంతోష్ రావు అని కవిత ఆరోపించారు. పార్టీ ఆవిర్భావం నుంచి వెన్నంటి ఉన్న నాయకులను సైతం కేసీఆర్ దరిచేరనీయకుండా అడ్డుకున్నారని ఆమె మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్ వంటి మహోన్నత వ్యక్తులు సైతం ప్రగతి భవన్ గేటు బయట గంటల తరబడి వేచి ఉండాల్సి రావడం వెనుక సంతోష్ రావు హస్తం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి పునాది లాంటి నాయకులను సైతం దూరం చేసిన ఘనత ఆయనదేనని విమర్శలు గుప్పించారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ బీఆర్ఎస్ పార్టీని వీడాల్సి వచ్చిందంటే దానికి కారణం సంతోష్ రావేనని కవిత స్పష్టం చేశారు. ఈ అన్ని అనర్థాలకు, పార్టీలో జరిగిన దుర్మార్గాలకు కేంద్ర బిందువు ఆయనేనని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలోని అనేక మంది సీనియర్ నాయకులకు ఆయన రక్తపు కన్నీరు తెప్పించారని, చాలామందిని మానసిక వేదనకు గురిచేశారని పేర్కొన్నారు. తాను చెబుతున్న రాజకీయ శక్తులలో మొదటి దుష్టశక్తి సంతోష్ రావు అని ఆమె తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. పార్టీ శ్రేణులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంతోష్ రావు ప్రధాన గూఢచారిగా వ్యవహరిస్తున్నారని కవిత ఆరోపించడం ఇప్పుడు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ తింటున్న ఆహారం గురించి, ఆయన ఆరోగ్యం గురించి ప్రతి చిన్న విషయాన్ని ఎప్పటికప్పుడు రేవంత్ రెడ్డికి చేరవేస్తున్నారని ఆమె ఆరోపించారు. కేసీఆర్ చుట్టూ ఉంటూనే ముఖ్యమంత్రికి సమాచారం అందిస్తున్న గూఢచారిగా ఆయన వ్యవహరిస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ పరిణామం బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల మధ్య ఇలాంటి ఆరోపణలు రావడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు సంతోష్ రావుకు నోటీసులు జారీ చేయడంపై కవిత సానుకూలంగా స్పందించారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గూఢచారి అయిన సంతోష్‌ను కాపాడుకుంటారేమోనన్న భయాన్ని ఆమె వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తన సన్నిహితుడైన సంతోష్ రావుకు శిక్ష విధిస్తారా లేక రక్షిస్తారా అన్నది వేచి చూడాలని ఆమె అన్నారు. పోలీసులు ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కవిత డిమాండ్ చేశారు. హరీశ్ రావు, కేటీఆర్ వంటి అగ్ర నాయకులు సంతోష్ రావుకు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావడం లేదని కవిత ప్రశ్నించారు. పార్టీని నష్టపరిచిన వ్యక్తిని ఇంకా ఎందుకు వెనకేసుకొస్తున్నారని ఆమె నిలదీశారు. సాధారణ పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు ఈ విషయంపై లోతుగా ఆలోచించాలని ఆమె పిలుపునిచ్చారు. నాయకుల మధ్య ఉన్న ఈ విభేదాలు పార్టీ భవిష్యత్తును ఏ తీరానికి చేరుస్తాయోనన్న ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీలో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. మరోవైపు తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు వేగవంతమైంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు కీలక అధికారులను, రాజకీయ నాయకులను సిట్ అధికారులు విచారిస్తున్నారు.

# డిజిటల్ మార్కెట్లో విశాల భారతి ప్రత్యేక స్థానం

## స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఐఎఎస్ చేతుల మీదుగా విశాల భారతి క్యాలెండర్ ఆవిష్కరణ

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:**

గ్రేటర్ హైదరాబాద్ నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్పేట్ డివిజన్ ఎస్.ఎన్.ఆర్ కళా కన్వెన్షన్ నందు విశాల భారతి తెలుగు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. పత్రికా రంగంలో విశాల భారతి సాధిస్తున్న ప్రగతికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ ఐఎఎస్ తో కలిసి విశాల భారతి నూతన క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పత్రికా రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. అనతి కాలంలోనే విశాల భారతి తెలుగు దిన పత్రిక ప్రజల మనసుల్లో విశ్వసనీయ మీడియాగా గుర్తింపు పొందిందని ప్రశంసించారు. ముద్రిత పత్రికతో పాటు డిజిటల్ మార్కెట్‌లో విశాల భారతి తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రజల సమస్యలను వేగంగా, నికరంగా ప్రజల ముందుకు తీసుకువచ్చే విధానమే విశాల భారతి విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో వార్తా రంగం వేగంగా మారుతున్న నేపథ్యంలో, విశాల భారతి డిజిటల్ మీడియాను సమర్థవంతంగా వినియోగిస్తూ ముందుకు సాగుతున్నదని వక్తలు తెలిపారు. డిజిటల్ న్యూస్ పోర్టల్, సోషల్ మీడియా వేదికల ద్వారా తక్షణ వార్తలు, ప్రజా సమస్యలపై ప్రత్యేక కథనాలు, విశ్లేషణాత్మక వార్తలను అందిస్తూ విస్తృత పాఠక లోకాన్ని చేరుకుంటోందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ స్థాయి నుంచి గ్రేటర్ హైదరాబాద్ వరకు ప్రజల సమస్యలను డిజిటల్ వేదికల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో విశాల భారతి కీలక పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు.



**విశాల భారతి ప్రత్యేకత ఏమిటంటే**, ప్రజలు–అధికారులు–ప్రజాప్రతినిధుల మధ్య ఒక బలమైన వారధిగా పనిచేయడం. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై వెంటనే స్పందించి, సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కార దిశగా చర్యలు జరిగేలా చేయడంలో పత్రిక తన సామాజిక బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తున్నదని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విశాల భారతి పత్రిక ఎడిటర్ అశోక్ మాట్లాడుతూ.. ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా నిష్పక్షపాతమైన, నిజమైన వార్తలను ప్రజలకు అందించడమే తమ ధ్యేయమని తెలిపారు. ముద్రిత పత్రికతో పాటు డిజిటల్ మీడియాను మరింత బలోపేతం చేస్తూ, భవిష్యత్తులో కూడా ప్రజల గొంతుకగా నిలిచి సమాజ అభివృద్ధికి తోడ్పడే విధంగా విశాల భారతి తన ప్రయాణాన్ని కొనసాగిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జాయింట్ కమిషనర్, నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జీహెచ్ఎంసీ రవీందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఎమ్మార్వో సుదర్శన్ రెడ్డి, పెద్ద అంబర్పేట్, కుంట్లూర్ డివిజన్లకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మాజీ చైర్పర్సన్ పండుగల జయశ్రీ రాజు, వైస్ చైర్‌పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, హయత్‌నగర్ మండల రైతు సహకార సంఘం తాజా మాజీ అధ్యక్షులు చామ కృష్ణారెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ కౌన్సిలర్లు జోర్క శ్రీరాములు, చెవుల హరిశంకర్, వైస్ చైర్మన్ సిద్ధాంతి కృష్ణ రెడ్డి, దండం రాజశేఖర్ రెడ్డి, పసుల రాజేందర్ ముదిరాజ్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు పాలడుగు నాగార్జున, ఓరుగంటి కొండల్ గౌడ్, జోర్క లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# పురపోరుకు




**మొదటిపేజీ తరువాయి**

అవగాహన రాజకీయ పార్టీలకు కలుగుతుంది. అనర్హత వేటు పడకుండా ఉండేందుకు అభ్యర్థులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోటీ నుంచి తప్పుకోవాలనుకునే వారికి ఎన్నికల కమిషన్ తగిన సమయాన్ని కేటాయించింది. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించడంతో రాజకీయ పార్టీలు బుజ్జగింపుల పర్వానికి తెరలేపాయి. టికెట్ దక్కక అసంతృప్తితో స్వతంత్రులుగా బరిలో దిగిన వారిని దారికి తెచ్చుకునేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. రెబల్ అభ్యర్థుల వల్ల ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉండటంతో వారిని పోటీ నుంచి తప్పించేందుకు రాయబారాలు సాగుతున్నాయి. ఉపసంహరణ గడువు ముగిసిన వెంటనే బరిలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను అధికారులు విడుదల చేస్తారు. దీని తర్వాతే అసలైన ప్రచార హోరు మొదలవుతుంది.

తుది జాబితా వెలువడిన తర్వాత పట్టణాల్లో ఎన్నికల ప్రచారం సరికొత్త పుంతలు తొక్కనుంది. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. పార్టీల మేనిఫెస్టోలు, పట్టణ అభివృద్ధి ప్రణాళికలు మరియు స్థానిక సమస్యలే ప్రధాన అజెండాగా ఈ ప్రచారం సాగనుంది. సోషల్ మీడియా వేదికగా కూడా జోరుగా ప్రచారం నిర్వహించేందుకు ఐటీ టీమ్‌లు రంగంలోకి దిగుతున్నాయి. పట్టణ ప్రగతిలో తాము చేసే అభివృద్ధిని వివరిస్తూనే ప్రత్యర్థుల వైఫల్యాలను ఎండగట్టేందుకు నాయకులు సిద్ధమవుతున్నారు. ఈ ప్రచార పర్వం ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఫిబ్రవరి 11వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 7:00 గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సందడి మొదలవుతుంది. సాయంత్రం 5:00 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం ఉండటంతో ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందనే అపవాదును తొలగించేందుకు ఎన్నికల సంఘం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 52 లక్షల మంది ఓటర్ల ఆకాంక్షలు ఈ పోలింగ్ ద్వారా బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం కానున్నాయి. ఎన్నికల క్రతువులో అత్యంత ఉత్కంఠభరితమైన ఘట్టం ఫిబ్రవరి 13న ఆవిష్కృతం కానుంది. ఆ రోజు ఉదయం 8:00 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. రౌండ్ల వారీగా ఫలితాలు వెలువడుతుంటే అభ్యర్థుల్లో మరియు వారి మద్దతుదారుల్లో టెన్షన్ పెరుగుతుంది. ఈ లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు ఏర్పాట్లు జరిగాయి. మధ్యాహ్నం నాటికే పట్టణాల పీఠాలను ఎవరు అధిరోహించబోతున్నారో స్పష్టమైన సంకేతాలు వెలువడతాయి. విజయకేతనం ఎగురవేసిన అభ్యర్థులకు అదే రోజు ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నారు. గెలిచిన అభ్యర్థులు రాబోయే ఐదేళ్ల పాటు పట్టణాల అభివృద్ధికి కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం మరియు తాగునీటి సరఫరా వంటి అంశాలపై వీరు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల ద్వారా ఎంపికయ్యే ప్రతినిధులు స్థానిక పాలనలో అత్యంత కీలక పాత్ర పోషిస్తారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగించాల్సిన బాధ్యత విజేతలపై ఉంటుంది.

# సీఎం కోల్ మాఫియా నాయకుడు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో సింగరేణి బొగ్గు గనుల టెండర్ల వ్యవహారం ఇప్పుడు పెను దుమారాన్ని రేపుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా కోల్ మాఫియాకు నాయకుడిగా వ్యవహరిస్తున్నారని, సింగరేణిని అవినీతికి నిలయంగా మార్చేశారని ఆయన ధ్వజమెత్తారు. ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ కేటీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ బృందం గవర్నర్‌కు అధికారికంగా ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన ప్రభుత్వ తీరును ఎండగడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. సింగరేణి సంస్థ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ వెలికితీత టెండర్లలో భారీ అక్రమాలు జరిగాయని కేటీఆర్ ఆరోపించారు. పారదర్శకతను తుంగలో తొక్కి తమకు నచ్చిన వారికి కాంట్రాక్టులు కట్టబెట్టేలా నిబంధనలను రూపొందించారని ఆయన మండిపడ్డారు. సుమారు ముప్పై ఐదు వేల కోట్ల రూపాయల విలువైన ఈ ప్రాజెక్టులో ప్రజాధనం యథేచ్ఛగా లూటీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో లాభాల బాటలో పయనించిన సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వీర్యం చేస్తోందని ఆయన ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యుల ప్రయోజనాల కోసమే ఈ నిబంధనలను మార్చారని కేటీఆర్ ప్రధానంగా ఆరోపించారు. ఇప్పటికే తమ్ముడికి లబ్ధి చేకూర్చారని, ఇప్పుడు బావమరిది కళ్ళల్లో ఆనందం చూడటమే లక్ష్యంగా బొగ్గు గనుల కాంట్రాక్టులను కట్టబెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు కీలక పాత్ర పోషించారని ఆయన విమర్శించారు. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని వేల కోట్ల రూపాయల అవినీతికి తెరలేపారని ఆయన స్పష్టం చేశారు. ఈ కుంభకోణంలో ప్రధానంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధనను తెరపైకి తెచ్చారని కేటీఆర్ వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రవేశపెట్టిన ఈ నిబంధన వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన కాంట్రాక్టర్లను పక్కన పెట్టి కేవలం తమకు అనుకూలంగా ఉండేవారికి మాత్రమే అనుమతులు ఇచ్చేలా ఈ నిబంధనను వాడుకుంటున్నారని ఆరోపించారు. సైట్ విజిట్ పేరిట అనర్హులైన గుత్తేదారులకు అడ్డగోలుగా ప్రాజెక్టులను అప్పగిస్తున్నారని, దీనివల్ల రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందని కేటీఆర్ వివరించారు. తెలంగాణ ప్రజల ఆస్తి అయిన సింగరేణిని కొందరు వ్యక్తుల స్వార్థం కోసం తాకట్టు పెడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా టెండర్ల ప్రక్రియలో రాజకీయ జోక్యం పెరిగిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి బావమరిది ఈ మొత్తం వ్యవహారానికి సూత్రధారిగా వ్యవహరిస్తున్నారని, ఆయన కనుసన్నల్లోనే ఫైళ్లు కదులుతున్నాయని ఆరోపించారు. నిబంధనలను అతిక్రమించి మరీ కాంట్రాక్టులను కేటాయించడం వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో గవర్నర్ వెంటనే స్పందించాలని కేటీఆర్ కోరారు. ఈ భారీ కుంభకోణంపై కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. అప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, దోషులు ఎవరో ప్రజలకు తెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

సింగరేణి కార్మికుల శ్రమను దోచుకుంటూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అక్రమాలపై తాము పోరాటం ఆపే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.



ప్రజా క్షేత్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మరోవైపు బీఆర్ఎస్ చేస్తున్న ఈ ఆరోపణలను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోంది. టెండర్ల ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే జరిగిందని, ఇందులో ఎటువంటి అక్రమాలకు తావులేదని మంత్రులు స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు కేవలం రాజకీయ లబ్ధి కోసమే లేని వివాదాలను సృష్టిస్తున్నారని వారు ప్రత్యారోపణలు చేస్తున్నారు. అధికార కోల్పోయిన అసహనంతోనే కేటీఆర్ ఇలాంటి నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి.

రాష్ట్రంలో బొగ్గు గనుల చుట్టూ తిరుగుతున్న ఈ రాజకీయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఇరు పార్టీల మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరుకోవడంతో సామాన్య ప్రజల్లో కూడా సింగరేణి భవిష్యత్తుపై చర్చ మొదలైంది. ఒకవైపు అవినీతి ఆరోపణలు, మరోవైపు పారదర్శకత వాదనల మధ్య నిజం ఎక్కడ ఉందనేది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది. గవర్నర్ ఈ ఫిర్యాదుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ వివాదం మరింత ముదిరే అవకాశం కనిపిస్తుండటంతో రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి. విచారణ డిమాండ్ల నేపథ్యంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఒకవేళ విచారణకు ఆదేశిస్తే అది ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతుందా లేక ఆరోపణలు ఉత్తుత్తివేనని తేలుతుందా అనేది వేచి చూడాలి. ప్రస్తుతానికి మాత్రం ఈ బొగ్గు రగడ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తూనే ఉంది.

# భారత్-ఈయూ మదర్ ఆఫ్ ఆల్ డీల్స్

**మొదటిపేజీ తరువాయి**

భారీ యంత్రాల దిగుమతి సులభతరం కానుంది. ఇప్పటివరకు ఉన్న అధిక పన్నుల భారం తగ్గడంతో దేశీయ ఉత్పత్తి రంగం మరింత వేగం పుంజుకోనుంది . సాధారణ వినియోగదారులకు కూడా ఈ ఒప్పందం వల్ల ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూరనున్నాయి. ఐరోపా నుంచి వచ్చే మద్యం, బీర్, వైన్‌పై ఉన్న భారీ ట్యాక్సులను ప్రభుత్వం గణనీయంగా తగ్గించింది. వైన్‌పై ఉన్న సుంకాన్ని కనిష్ట స్థాయికి తీసుకురాగా, స్పిరిట్స్, బీర్‌పై కూడా పన్నుల కోత విధించింది. అలాగే వంట గదుల్లో వాడే ఆలివ్ ఆయిల్, వెజిటబుల్ ఆయిల్ వంటి ఆహార ఉత్పత్తులపై సుంకాన్ని పూర్తిగా ఎత్తివేయడం వల్ల సామాన్యులపై భారం తగ్గనుంది. దిగుమతి చేసుకునే యూరోపియన్ ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్ల మార్కెట్‌లో పోటీ పెరిగి నాణ్యమైన వస్తువులు అందుబాటులోకి రానున్నాయి. విదేశీ కార్ల ప్రియులకు కూడా ఈ ఒప్పందం తీపి కబురు అందించింది. ఐరోపా నుంచి దిగుమతి అయ్యే లగ్జరీ కార్లపై పన్నులను దశలవారీగా పది శాతానికి తగ్గించనున్నారు. అయితే దేశీయ కార్ల పరిశ్రమను దృష్టిలో ఉంచుకుని ఏటా 2.5 లక్షల కార్ల దిగుమతికి మాత్రమే అనుమతిని పరిమితం చేశారు. విమానయాన, అంతరిక్ష రంగాలకు సంబంధించిన పరికరాలపై కూడా ట్యాక్స్ మినహాయింపులు లభించాయి. దీనివల్ల భారత విమానయాన సంస్థల నిర్వహణ వ్యయం తగ్గడమే కాకుండా అంతరిక్ష పరిశోధనల్లో ఐరోపా దేశాలతో కలిసి పని చేసే అవకాశాలు మెరుగుపడనున్నాయి. కేవలం వస్తువుల మీదనే కాకుండా సేవల రంగంలో కూడా ఈ ఒప్పందం పెను మార్పులు తీసుకురానుంది. యూరోపియన్ బ్యాంకింగ్, షిప్పింగ్ సంస్థలకు భారత మార్కెట్‌లో సులభంగా ప్రవేశం కల్పించనున్నారు. దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు మరింత సులభతరం అవుతాయి. సముద్ర ప్రయాణాలు , రవాణా సేవలు చౌకగా మారడం వల్ల అంతర్జాతీయ వాణిజ్యానికి భారత్ కీలక కేంద్రంగా మారుతుంది. ఐరోపా కంపెనీలు భారత సేవల రంగంలో పెట్టుబడులు పెట్టడం వల్ల దేశంలో ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

రక్షణ , భద్రత రంగాల్లో కూడా భారత్ యూరోపియన్ యూనియన్ అడుగులు కలిసి పడనున్నాయి. ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల కోసం ఉమ్మడిగా కృషి చేయాలని రెండు పక్షాలు నిర్ణయించుకున్నాయి. సముద్ర భద్రత, సైబర్ క్రైమ్ నివారణ, ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఇరు దేశాల రక్షణ దళాల మధ్య సహకారం పెరగనుంది. రక్షణ రంగ ఉత్పత్తుల తయారీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం వల్ల భారత్ స్వావలంబన సాధించే దిశగా అడుగులు పడతాయి. ఇది దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది.

పర్యావరణ హితమైన అభివృద్ధి కోసం యూరోపియన్ యూనియన్ భారత్‌కు భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. రాబోయే రెండేళ్లలో సుమారు 500 మిలియన్ యూరోలను గ్రీన్ టెక్నాలజీ, శుభ్రమైన ఇంధన వనరుల కోసం భారత్‌కు అందించనుంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను తగ్గించేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ మార్పులపై పోరాడుతున్న తరుణంలో భారత్, ఐరోపా దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఇతర దేశాలకు ఆదర్శంగా నిలవనుంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. వాణిజ్య పరంగా చూస్తే ఈ ఒప్పందం వల్ల యూరోపియన్ యూనియన్‌కు ఏడాదికి సుమారు 4 బిలియన్ యూరోల మేర సుంకాలు ఆదా అవుతాయి. అలాగే 2032 నాటికి భారత్ ఐరోపా మధ్య జరిగే మొత్తం వ్యాపారం ఇప్పుడున్న దానికంటే రెండింతలు అవుతుందని అంచనా వేస్తున్నారు.



ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో 25 శాతం వాటా ఉన్న ఈ రెండు పెద్ద ఆర్థిక శక్తులు చేతులు కలపడం వల్ల ప్రపంచ వాణిజ్య క్రమం మారబోతోంది. ఇది కేవలం ఒక వ్యాపార లావాదేవీ మాత్రమే కాదని ఇరు పక్షాలు గౌరవప్రదంగా ప్రకటించడం గమనార్హం.

ఈ ఒప్పందాన్ని విశ్లేషకులు 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణిస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ డాలర్ల దిశగా తీసుకెళ్లడంలో ఈ భాగస్వామ్యం అత్యంత కీలకం కానుంది. అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ప్రాముఖ్యతను ఈ ఒప్పందం మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది. ప్రధాని మోడీ చెప్పినట్లుగా ఇది భారత్, యూరోపియన్ దేశాల మధ్య ఉమ్మడి వృద్ధికి వేసిన ఒక పటిష్టమైన బాట. ఈ చారిత్రాత్మక పరిణామం రాబోయే రోజుల్లో భారత్‌ను గ్లోబల్ సప్లై చైన్ నెట్‌వర్క్‌లో తిరుగులేని శక్తిగా నిలబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

## నేడు మునగాలకు మందకృష్ణ మాదిగ రాక

**మునగాల, విశాలభారతి:** కర్ల రాజేష్ సంతాప సభ స్థలం పరిశీలన 2812026 సాయత్రం 5 గంటలకు కర్ల రాజేష్ సంతాప సభ మునగాల మండల కేంద్రంలో ఎస్సీ మాదిగ వాడాలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పి మండల కమిటీ ఆధ్వర్యంలో కర్ల రాజేష్ సంతాప సభ నిర్వహించడం జరుగుతుంది, అని వేల్పుల సూరన్న మున్నూరు కాపు ఎంఎస్పి జాతీయనాయకులు బోర్ర బిక్షపతి మాదిగ ఎమ్మార్పీఎస్ జాతీయఅధికార ప్రతినిధి, ఏపూరి రాజు మాదిగ, ఎంఎస్ పి సూర్యాపేటజిల్లా అధికార ప్రతినిధిలు తెలుపుతూ ఈ సభకు ముఖ్య అతిథిలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు గౌ"శ్రీ మంద కృష్ణ మాదిగ, పాల్గొంటారు. చట్ట పరంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5న చలో సూర్యాపేట మహా భారీ ర్యాలీ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు స్థల పరిశీలన కార్యక్రమంలో వేల్పుల సూరన్న, మున్నూరు కాపు ఎంఎస్పీ జాతీయనాయకులు, బోర్ర బిక్షపతి మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, ఏపూరి రాజుమాదిగ, ఎంఎస్పీ జిల్లా



అధికార ప్రతినిధి కొండపల్లి ఆంజనేయులు మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్రనాయకులు, దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎం ఎస్ పి జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట్ల నాగరాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లంజపల్లి శ్రీను మాదిగ ఎమ్మెస్పి మునగాల మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మునగాల మండల అధ్యక్షుడు, కుదుముల శ్రీను మాదిగ, ఎమ్మార్పీఎస్ కోదాడ పట్టణ అధ్యక్షులు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మిక మృతి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ఆకస్మిక మృతి అత్యంత విషాదకరమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వంగ మధుసూదన్ రెడ్డి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో వంగ మధుసూదన్ రెడ్డి మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని తెలిపారు.ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా,రాజకీయాలకు అతీతంగా అందరితో సన్నిహితంగా మెలిగిన నాయకుడిగా వంగ మధుసూదన్ రెడ్డి గుర్తుండిపోతారని పేర్కొన్నారు.అనంతరం ఆయన వంగ మధుసూదన్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం, మనోబలాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని వంగ మధుసూదన్ రెడ్డి మృతికి సంతాపం తెలిపారు.

# నేటి నుంచి పార్లమెంట్ సమావేశాలు

**విశాలభారతి, జాతీయం:**

పార్లమెంట్ వేదికగాలీక అడుగులు భారత ఆర్థిక వ్యవస్థ గమనాన్ని శాసించే అత్యంత కీలకమైన 2026 27 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ సమావేశాలకు దేశ రాజధాని నగరం ఢిల్లీ సర్వం సిద్ధమైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ పార్లమెంట్ బడ్జెట్ సెషన్ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఉభయ సభల కార్యకలాపాలు ఎటువంటి ఆటంకాలు లేకుండా, ప్రజాస్వామ్యబద్ధంగా సాగేలా చూసేందుకు కేంద్రం ఇవాళ అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు నేతృత్వంలో జరిగిన ఈ భేటీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించి, వివిధ పార్టీల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ అఖిలపక్ష భేటీలో ప్రధానంగా సభా నిర్వహణ షెడ్యూల్, రాబోయే రోజుల్లో చర్చకు రానున్న బిల్లులు, ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై లోతైన చర్చలు జరిగాయి. దేశ ఆర్థిక స్థితిగతులను మార్చే బడ్జెట్ వంటి ప్రతిష్ఠాత్మక సమయంలో సభలో గందరగోళం చోటు చేసుకోకుండా, అర్థవంతమైన చర్చలు జరిగేలా సహకరించాలని అన్ని పార్టీలకు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్లమెంట్ వేదిక కావాలని, సభ్యులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రులు ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ విజ్ఞప్తిపై ప్రతిపక్షాలు కూడా సానుకూలంగా స్పందిస్తూనే, తమ అజెండాను స్పష్టంగా వివరించాయి. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ఈ సమావేశాల పట్ల పూర్తి సన్నద్ధతను వ్యక్తం చేసింది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న నిరుద్యోగ సమస్య, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, సామాన్యుడిపై పడుతున్న భారాలను సభలో గట్టిగా నిలదీస్తామని కాంగ్రెస్ నేత కే. సురేష్ స్పష్టం చేశారు. తాము చర్చలకు ఎప్పుడూ సిద్ధమేనని, అయితే ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానాలు రావాలని ఆయన డిమాండ్ చేశారు. సభా మర్యాదలను పాటిస్తూనే



ప్రజా గొంతుకను వినిపిస్తామని ప్రతిపక్ష నేతలు ఈ సమావేశంలో సంకేతాలిచ్చారు.

ఈ ఏడాది బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం ముప్పై రోజుల పాటు సాగే ఈ చర్చలలో అనేక కీలక బిల్లులు ఆమోదం పొందే అవకాశం ఉంది. మొదటి దశ సమావేశాలు జనవరి 28వ తేదీ నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 13వ తేదీ వరకు కొనసాగుతాయి. ఆ తర్వాత స్వల్ప విరామం ఇచ్చి, రెండో దశ సమావేశాలను మార్చి 9వ తేదీ నుంచి ప్రారంభించి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ సుదీర్ఘ కాల పరిమితిలో దేశవ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల సమస్యలు చర్చకు వస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

పార్లమెంట్ సమావేశాల తొలి రోజైన రేపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రాష్ట్రపతి ప్రసంగంతో ఈ బడ్జెట్ సెషన్ అధికారికంగా ప్రారంభమవుతుంది. ప్రభుత్వం గత కాలంలో సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కీలక పథకాలపై రాష్ట్రపతి తన ప్రసంగంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ ప్రసంగం అనంతరం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో సుదీర్ఘ చర్చ జరగనుంది. దీనిని సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడివేడి వాదనలకు నాందిగా పరిగణించవచ్చు.

అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత వస్తున్న పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో, దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఆదాయపు పన్ను స్లాబులలో మార్పులు, సామాన్యులకు ఊరటనిచ్చే ప్రకటనలు ఉంటాయని మధ్యతరగతి ప్రజలు ఆశిస్తున్నారు. ఆర్థిక మంత్రి ఈసారి ఎలాంటి సంస్కరణలకు శ్రీకారం చుడతారోనన్న ఉత్కంఠ పారిశ్రామిక వర్గాల్లోనూ నెలకొంది.

ఈ బడ్జెట్ సెషన్‌లో ప్రధాన అజెండాగా దేశ ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయడం, కొత్త పన్ను విధానాల అమలు, సామాజిక భద్రత కల్పించడం వంటి అంశాలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పన కోసం భారీగా నిధులు కేటాయించే అవకాశం ఉందని తెలుస్తోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న భారత్‌ను ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశగా ఈ బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు ఉండబోతున్నాయని సమాచారం. అఖిలపక్ష సమావేశం ద్వారా ఒకే అజెండాపై ఏకాభిప్రాయానికి రావడం వల్ల శాసన సంబంధిత పనులు వేగవంతం అవుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంపై కూడా ఈసారి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. వ్యవసాయ రంగానికి రాయితీలు, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు వంటి అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే తయారీ రంగాన్ని ప్రోత్సహించడానికి 'మేక్ ఇన్ ఇండియా' పథకానికి మరిన్ని ఊతమిచ్చేలా ప్రకటనలు వెలువడవచ్చు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను మరింత విస్తరించడం ద్వారా పారదర్శకతను పెంచేందుకు అవసరమైన చర్యలను బడ్జెట్‌లో పొందుపరిచే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

దేశ రక్షణ రంగంపై కూడా ఈసారి బడ్జెట్‌లో గణనీయమైన కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా సరిహద్దు భద్రతను పటిష్టం చేయడం, స్వదేశీ రక్షణ పరికరాల తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం వంటివి చర్చనీయాంశాలు కానున్నాయి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి పథకాలకు పెద్దపీట వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్య, ఆరోగ్య రంగాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సుస్థిర అభివృద్ధిని సాధించడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ రూపొందుతోంది.

మొత్తానికి, 202627 బడ్జెట్ సమావేశాలు కేవలం ఆర్థిక గణాంకాలకే పరిమితం కాకుండా, దేశ భవిష్యత్తుకు బలమైన పునాది వేసేలా ఉంటాయని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. సామాన్యుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు ప్రతి ఒక్కరూ తమకు మేలు జరుగుతుందని ఆశావహ దృక్పథంతో ఉన్నారు. నేడు నుంచి ప్రారంభమయ్యే ఈ సభా పర్వంలో అధికార, ప్రతిపక్షాలు ఎంతవరకు సమన్వయంతో వ్యవహరిస్తాయో వేచి చూడాలి. సజావుగా సాగే చర్చలు మాత్రమే దేశ పురోగతికి బాటలు వేస్తాయని సగటు భారతీయుడు కోరుకుంటున్నాడు.

# అవినీతిపరులకే మద్దతు

**మొదటిపేజీ తరువాయి**

దీనికి తోడు రాజకీయ రంగు పులుముకున్న సోషల్ మీడియా వేదికలు అగ్నికి ఆజ్యం పోస్తూ సమాజంలో చీలికను మరింత పెంచుతున్నాయి. ప్రస్తుత రాజకీయాల్లో పార్టీలు తమ ఆధిపత్య పోరును కేవలం రాజకీయ గొడవగా కాకుండా, ధర్మానికి అధర్మానికి మధ్య జరుగుతున్న యుద్ధంగా చిత్రీకరించడం ఒక ఫ్యాషన్‌గా మారింది. తాము చేసేది ప్రజాస్వామ్య పరిరక్షణ అని, అవతలి వారు చేసేది నిరంకుశ పాలన అని పరస్పరం ముద్రలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో నైతికత, సమర్థత వంటి విలువలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయి. రాజకీయ నాయకులు ప్రదర్శించే ఈ కృత్రిమ ఆవేశం వల్ల ప్రజలు భావోద్వేగాలకు లోనై రెండు వర్గాలుగా విడిపోవడం దేశ భవిష్యత్తుకు ఏమాత్రం శ్రేయస్కరం కాదు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, సింగరేణి బొగ్గు కుంభకోణం కేసులే ఇందుకు నిదర్శనం. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య జరుగుతున్న విమర్శల యుద్ధం సామాన్యుడికి తలపోటుగా మారింది. తాము ఎవరి ఫోన్లు ట్యాపింగ్ చేయలేదని, ఇదంతా రాజకీయ కక్ష సాధింపేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గట్టిగా వాదిస్తున్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడలేదని వారు చెబుతుంటే, క్షేత్రస్థాయిలో అందుతున్న ఆధారాలు మరోలా ఉన్నాయని ప్రభుత్వం అంటోంది. మరోవైపు సింగరేణి నైని గనుల కేటాయింపు విషయంలో ఇద్దరు కాంగ్రెస్ మంత్రుల మధ్య పోటీ నెలకొందన్న వార్తలు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించడం ద్వారా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగారు. అధికార పక్షం తప్పులను ఎండగట్టడం ప్రతిపక్షం బాధ్యతైనప్పటికీ, తమపై వచ్చిన ఆరోపణల నుంచి తప్పించుకోవడానికి ఇదొక వ్యూహంగా వాడుతున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే ఈ సింగరేణి కట్టుకథను తెరపైకి తెచ్చారని కాంగ్రెస్ మంత్రులు ఆరోపిస్తున్నారు.

మాజీ ముఖ్యమంత్రి కుమార్తె కల్వకుంట్ల కవితతో సహా పలువురు నేతలు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని అభిప్రాయపడుతున్నా, పార్టీ పరంగా బీఆర్ఎస్ దానిని తోసిపుచ్చుతోంది. దర్యాప్తు సంస్థల విచారణ



నెమ్మదిగా ఉన్నత స్థాయి నేతల వైపు మళ్లుతుండటంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకమైన భాష, ప్రతిపక్షంలోకి రాగానే మరో రకమైన విమర్శలు చేయడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. ఒక పార్టీ అవినీతిని మరొక పార్టీ బయటపెట్టడం మంచిదే అయినా, అది కేవలం రాజకీయ స్వలాభం కోసమే జరగడం ఇక్కడ విషాదం. ప్రజలు ఎవరిని నమ్మాలి అనే ప్రశ్న ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఒకప్పుడు నిష్పక్షపాతంగా ఉండాల్సిన మేధావులు సైతం ఇప్పుడు కులం, మతం, ప్రాంతం పేరుతో విడిపోవడం గమనార్హం. సమాజాన్ని మేల్కొల్పాల్సిన మేధావి వర్గం తమ రాజకీయ విధేయతలను బట్టి వాదనలు వినిపిస్తుంటే, సామాన్య ప్రజలు ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు. మేధావుల మేధస్సు ప్రజా ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువగా ఉపయోగపడుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి మన పూర్వీకులు కులమతాలకు అతీతంగా ఏకతాటిపై నిలిచి పోరాడారు. ఆనాడు ఉన్న ఆ ఐక్యత, త్యాగనిరతి నేటి తరంలో కనుమరుగవుతున్నాయి. రాజకీయ నాయకులు అందినకాడికి దోచుకుంటున్నారని ఒకవైపు ఆరోపణలు వస్తున్నా, ప్రజలు వాటిని ప్రశ్నించకుండా తమకిష్టమైన నేతల మాయమాటల్లో పడిపోతున్నారు. ప్రజల్లో ఉన్న ఈ విభజన రాజకీయ నాయకులకు వరంగా మారుతోంది. ఇది కేవలం ఒక రాష్ట్రానికో, ఒక పార్టీకో పరిమితం కాలేదు, దేశవ్యాప్తంగా ఇదే ధోరణి కనిపిస్తోంది.

అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్పే నాయకులు అధికారంలోకి వచ్చాక పాత పద్ధతులనే అనుసరించడం వల్ల వ్యవస్థపై సామాన్యుడికి నమ్మకం సడలిపోతోంది. విచారణ సంస్థలు కూడా రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతున్నాయన్న వాదనలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి. దోషులు ఎవరైనా సరే శిక్ష పడాలనే కనీస ధర్మం అమలు కావడం లేదని ప్రజలు భావిస్తున్నారు. ఈ రాజకీయ క్రీడలో నిజం ఎప్పుడూ బలిపశువు అవుతూనే ఉంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే ప్రభువులు అని చెబుతున్నా, ఆచరణలో మాత్రం నాయకులే రాజ్యమేలుతున్నారు. ప్రజల మధ్య గోడలు కట్టి వారిని విడదీయడం ద్వారా తమ పబ్బం గడుపుకోవాలని చూసే రాజకీయాల పట్ల జనం అప్రమత్తంగా ఉండాలి. అధికారం పోగానే నీతిమంతులుగా మారిపోయే నాయకుల అసలు రంగును గుర్తించాల్సిన బాధ్యత ఓటర్లపై ఉంది. నాయకులు మారుతున్నా, వ్యవస్థలో మార్పు రాకపోవడానికి ప్రధాన కారణం ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని మర్చిపోవడమే. రాజకీయ చైతన్యం అంటే కేవలం ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం కాదు, తప్పు ఎవరు చేసినా నిలదీయడం. ఫోన్ ట్యాపింగ్ అయినా, బొగ్గు కుంభకోణం అయినా, ఏ విచారణ అయినా సరే పారదర్శకంగా జరిగి నిజానిజాలు ప్రజల ముందుకు రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది. రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలు తమలో తాము విడిపోవడం ఆపి, దేశాభివృద్ధి కోసం ఐక్యంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది.

# మేడారం మహా జాతరకు సర్వం సిద్ధం

**మొదటిపేజీ తరువాయి**

వీరితో పాటు రెండు వేల మంది స్థానిక ఆదివాసీ యువత వాలంటీర్లుగా మారి భక్తులకు దిశానిర్దేశం చేస్తున్నారు. మొత్తం మేడారం ప్రాంతాన్ని ఎనిమిది పరిపాలనా జోన్లుగా విభజించి పకడ్బందీగా పర్యవేక్షణ చేస్తున్నారు. ప్రతి సెక్టార్‌కూ ఒక బాధ్యుడిని నియమించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయడంతో పాటు స్నాన ఘట్టాల వద్ద మహిళల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ రూములను నిర్మించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా ఐదు వేలకు పైగా నల్లాలు ఏర్పాటు చేశారు. పారిశుధ్యం విషయంలో రాజీ పడకుండా ఐదు వేల మంది పారిశుధ్య కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారు. వేల సంఖ్యలో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణ కోసం వందలాది వాహనాలను రంగంలోకి దించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేశారు.

రవాణా వ్యవస్థపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి సారించింది. భక్తుల కోసం వివిధ ప్రాంతాల నుంచి నాలుగు వేల బస్సులను నడుపుతోంది. సొంత వాహనాల్లో వచ్చే వారి కోసం 1400 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారీ పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. రహదారుల మరమ్మతులు, కొత్త కల్వర్టుల నిర్మాణం ద్వారా ప్రయాణాన్ని సులభతరం చేశారు. భక్తుల ఆరోగ్య రక్షణ కోసం ఐదు వేల మంది వైద్య సిబ్బందిని కేటాయించి అత్యవసర చికిత్సా కేంద్రాలను నెలకొల్పారు. అటవీ ప్రాంతంలో మొబైల్ సిగ్నల్ సమస్య రాకుండా తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసి సమాచార వ్యవస్థను బలోపేతం చేశారు. మేడారం ఇప్పుడు ఒక ఆధునిక మహా నగరంగా రూపాంతరం చెందింది.

మేడారం జాతర అనేది కేవలం ఒక మతపరమైన ఉత్సవం మాత్రమే కాదు, అది గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీక. అన్యాయాన్ని ఎదిరించి పోరాడిన తల్లీకూతుళ్ల వీరగాథను స్మరిస్తూ భక్తులు ఇచ్చే 'బంగారం' (బెల్లం) వారి నమ్మకానికి చిహ్నం. ఎటు చూసినా శివసత్తుల పూనకాలు, డప్పు దరువులు, కొమ్ము బూరల నాదాలతో అడవి మొత్తం ప్రతిధ్వనిస్తోంది. కోటిన్నర మంది భక్తులు



వస్తారనే అంచనాతో యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంది. ట్రాఫిక్ మళ్లింపు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. ముఖ్యంగా జంపన్నవాగు వద్ద భక్తుల రద్దీని నియంత్రించడానికి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

జాతరలో శాంతిభద్రతల నిర్వహణ కోసం భారీగా పోలీసు బలగాలను మోహరించారు. సీసీ కెమెరాల నిఘాతో పాటు డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. తప్పిపోయిన వారిని వెతికేందుకు, భక్తులకు సమాచారాన్ని అందించేందుకు కంట్రోల్ రూములను సమర్థవంతంగా వినియోగిస్తున్నారు. గిరిజన సంప్రదాయాలను గౌరవిస్తూనే ఆధునిక సాంకేతికతను జోడించి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్తుల రక్షణ కోసం అగ్నిమాపక యంత్రాలను, అంబులెన్సులను కీలక ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచారు. ప్రభుత్వం చేస్తున్న ఈ కృషి భక్తుల ప్రశంసలు అందుకుంటోంది.

విద్యా రంగంలో మార్పులు రావాలనే ఆకాంక్ష సమాజంలో బలంగా ఉన్నప్పటికీ, ఇలాంటి సాంస్కృతిక వేడుకలు ప్రజలందరినీ ఏకం చేస్తున్నాయి. గిరిజన ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించే వేదికగా మేడారం నిలుస్తోంది. వన దేవతల ఆశీస్సుల కోసం లక్షలాది మంది తమ ఇష్టదైవాలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రతి ఏటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు అనుగుణంగా వసతులను మెరుగుపరుస్తూ ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఈ అద్భుతమైన జాతరను వీక్షించేందుకు విదేశాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తున్నారు.

ఈ మహా జాతర తెలంగాణ సాంప్రదాయానికి, ఆత్మగౌరవానికి నిదర్శనంగా నిలుస్తోంది. రాబోయే నాలుగు రోజులు మేడారం భక్తజన సంద్రం కానుంది. ప్రతి అడుగులోనూ భక్తిభావం, ప్రతి మలుపులోనూ ఆత్మీయత ఉట్టిపడుతున్నాయి. తల్లుల దీవెనలు ప్రజలందరిపై ఉండాలని భక్తులు మనసారా కోరుకుంటున్నారు. భారీ ఎత్తున వస్తున్న భక్తుల రద్దీని తట్టుకునేలా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తూనే ఉంది. ప్రజల సహకారం ఉంటేనే ఈ ఉత్సవం దిగ్విజయంగా పూర్తవుతుందని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. మేడారం అడవిలో వికసించిన ఈ భక్తి విప్లవం ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. మొత్తానికి మేడారం సమ్మక్కసారలమ్మ జాతర ఒక చారిత్రక ఘట్టంగా ఆవిష్కృతమవుతోంది. అడవి బిడ్డల పోరాట పటిమను గుర్తుచేస్తూ సాగే ఈ యాత్ర భక్తుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని నమ్ముతున్నారు. ప్రభుత్వం, అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేస్తూ ఈ మహా జాతరను విజయవంతం చేయడానికి సిద్ధంగా ఉన్నారు. భక్తుల కోలాహలం మధ్య తల్లుల రాకతో మేడారం పులకించిపోయింది. ఈ నాలుగు రోజుల ఉత్సవం తెలంగాణ చరిత్రలో మరో సువర్ణ అధ్యాయంగా నిలిచిపోనుంది. జాతర ముగిసే వరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవడమే లక్ష్యంగా యంత్రాంగం అడుగులు వేస్తోంది.

# రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న జవహర నగర్ ఏసిపి చక్రపాణి



**కీసర, విశాలభారతి :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన జవహర్‌నగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన చక్రపాణి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామివారిని మంగళవారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తాటకం వెంకటేశ్ శర్మ ఆలయ అర్చకులతో ఘనంగా స్వాగతం పలికారు.గర్భాలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు.అనంతరం ఆలయ మండపంలో ఏసిపి చక్రపాణికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువ కప్పి సత్కరించారు.ఈ సంధర్బంగా ఏసిపి చక్రపాణి మాట్లాడుతూ జవహర్ నగర్ ఏసిపి గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్వామివారి దర్శనం చేసుకోవడం ఆధ్యాత్మిక శాంతిని కలిగిస్తుందని అన్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గౌడ వృత్తిదారుల హక్కులను కాపాడేందుకు పోరాటానికి సిద్ధం

- **ఈత చెట్ల తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి**
- **తహసిల్దార్ ఫిర్యాదు చేసిన గౌడ మండల అధ్యక్షుడు నాయబ్ గౌడ్**



**మర్పల్లి, విశాలభారతి:** మండల కేంద్రంలో అనుమతులు లేకుండా ఈత చెట్లను నరికివేయడం గౌడ కులస్తుల జీవనంపై నేరుగా దాడి చేయడమేనని గౌడ సంఘం నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ నెల 24 వ తేదీన మండల కేంద్రంలో నీ సర్వే నంబర్ 134/1, 134/2లలో అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు తొలగించిన ఈత చెట్ల పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మర్పల్లి మండలం గౌడ సంఘం మండల అధ్యక్షుడు నాయబ్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం తహసిల్దార్ పురుషోత్తం కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షులు నాయబ్ గౌడ్ గారు మాట్లాడుతూ, "ఈత చెట్లు గౌడల జీవనాధారం వాటిని నరికివేయడం అంటే మా కుటుంబాల ఉపాధిని నాశనం చేయడ మే అని కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారు అనేకమంది గౌడ కులస్తులు ఉన్నారని ప్రభుత్వం లైసెన్సులు జారీ చేయాలంటే కచ్చితంగా ఈద చెట్లు ఉండాలని నిబంధన ఉందని దీంతో ఈత చెట్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈత చెట్లు తొలగించిన అగ్రవర్ణాలపై తగిన చర్యలు తీసుకోవాలని లేని యెడల గౌడ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లోనూ అక్రమంగా ఈత చెట్లు నరికివేస్తున్నా సంబంధిత శాఖలు చూస్తూ ఊరుకుంటున్నాయని నాయకులు ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల ఉపాధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, రమేష్ గౌడ్, బలరాం గౌడ్, వీరేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొని తమ నిరసనను ఘాటుగా వ్యక్తం చేశారు.

# రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరగా పూర్తి చేయాలి

- **హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్**



**ఎల్బీనగర్, విశాలభారతి :** అగ్రికల్చర్ కాలనీలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో త్వరిత గతిన పూర్తి చేయాలని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ కోరారు. అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్ర మోహన్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్ ను అధికారులను ఆదేశించారు 50 అడుగుల రోడ్లో డ్రైనేజీ నిర్మించాలని కాలనీవాసులు కోరగా అగ్రికల్చర్ హౌసింగ్ సొసైటీలో ఉన్న నిధులతో అట్టి పనులను చేపట్టుకోవాలని కార్పొరేటర్ కాలనీ వాసులకు సూచించారు. కాలనీలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తెచ్చిన వెంటనే ప్రజా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి కోట్లాది రూపాయలు డివిజన్ అభివృద్ధికి మంజూరు చేయించి అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తాము జిహెచ్ఎంసి కి చెల్లిస్తున్న పన్నులతోనే అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అగ్రికల్చర్ కాలనీ ప్రధాన కార్యదర్శి అగ్రికల్చర్ కాలనీ ప్రధాన కార్యదర్శి జితేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, రాము నేత తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు పూర్తి చేయాలి: తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్ర నగర్ నియోజకవర్గ పరిధిలోని మైలర్ దేవ్‌పల్లి డివిజన్, లక్ష్మీ గూడా వాంబే కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి అధికారులు, పార్టీ నాయకులు మరియు బస్తీ వాసులతో కలిసి పరిశీలించారు. అభివృద్ధి పనులలో భాగంగా పలు బ్లాక్‌ల మధ్య నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల పురోగతిని ఆయన పర్యవేక్షించారు. అలాగే ఆర్ జి కే బ్లాక్ పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ పనులపై కూడా అధికారులతో చర్చించిన శ్రీనివాస్ రెడ్డి, డ్రైనేజ్ సమస్యలు పెద్ద సమస్యగా మారకముందే శాశ్వతంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. డివిజన్ పరిధిలో ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే, అధికారులతో సమన్వయం చేసుకొని శాశ్వత పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్‌స్పెక్టర్లు రాహుల్, ప్రసాద్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎస్ బి అధికారులు, మాజీ డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్ధన్, సచిన్ షిండే, పూజ, లలిత గౌడ్,కిరణ్, రాధమ్మతో పాటు ఆర్ జి కే యూత్ అసోసియేషన్ స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఓటీలో సైబర్ భద్రతా ముప్పులపై అతిథి ఉపన్యాసం




**హైదరాబాద్, విశాలభారతి:** సీబీఐటీ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ & డేటా సైన్స్ (ఎఐ&డిఎస్) మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాలు సంయుక్తంగా "ఆధునిక యుగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ – సవాళ్లు, ముప్పులు మరియు పరిమితులు" అనే అంశంపై అతిథి ఉపన్యాసాన్ని నిర్వహించారు. ఈ అతిథి ఉపన్యాసాన్ని డా. కోటా సోలమన్ రాజు, చీఫ్ సైంటిస్ట్ , హెడ్, ఇన్ఫర్మేషన్ & కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగం, సీఎస్ఐఆర్ – నేషనల్ ఏరోస్పేస్ ల్యాబొరేటరీస్, బెంగళూరు వారు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఐఓటీకి సంబంధించిన ఆధునిక సాంకేతికతలు, సైబర్ భద్రతా ముప్పులు, విస్తృత స్థాయి అమలులో ఎదురయ్యే సవాళ్లు మరియు పరిమితులపై పరిశ్రమ మరియు ఏరోస్పేస్ రంగ అనుభవాలతో విశ్లేషణ చేశారు. కళాశాల యాజమాన్యం ప్రోత్సాహంతో, కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. వి. నరసింహులు నాయకత్వంలో, ఎఐ&డిఎస్ విభాగాధిపతి డా. కె. రాధిక మరియు ఈసిఈ విభాగాధిపతి డా. కె. వసంత్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఈసిఈ విభాగానికి చెందిన ఐఈఐ విద్యార్థుల చాప్టర్ సహకారంతో జరిగింది. ఈ కార్యక్రమాన్ని డా. కె. రమణ, అసోసియేట్ ప్రొఫెసర్, ఎఐ&డిఎస్ విభాగం, మరియు డా. భాస్కర్ దప్పూరి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. శ్రీకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఈసిఈ సమన్వయం చేశారు. ఈ ఉపన్యాసంలో ఐఓటీ వ్యవస్థల్లో సైబర్ భద్రత ప్రాధాన్యతను వివరించడంతో పాటు, ఇది ఐక్యరాజ్యసమితి స్థిర అభివృద్ధి లక్ష్యాలు లోని లక్ష్యం-9 (పరిశ్రమ, ఆవిష్కరణ మరియు మౌలిక సదుపాయాలు) మరియు లక్ష్యం-11 (సుస్థిర నగరాలు మరియు సమాజాలు) తో అనుసంధానమై ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఈసిఈ మరియు ఎఐ&డిఎస్ విభాగాలకు చెందిన అధ్యాపకులు మరియు 250 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, కార్యక్రమాన్ని అత్యంత విజ్ఞానప్రదంగా మరియు ప్రభావవంతంగా విజయవంతం చేశారు.

# అబద్దాలకు మోసాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ

- **కార్పోరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి బుద్ధి చెప్పాలి**
- **మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
- **కళ్యాణ్ నగర్ లక్ష్మి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డుల పంపిణీ**

**విశాలభారతి, గోదావరిఖని:**



అబద్దాలకు మోసాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ, అడ్డగోలు హామిలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వచించింది రెవంత్ సర్కార్ కాంగ్రెస్ పార్టీ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం స్థానిక కళ్యాణ్ నగర్ లక్ష్మినగర్లో కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాలుగా చేస్తున్న మోసాలను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వివరించారు. అనంతరం అయన మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు సమయంలో ప్రతేక్షంగా సంతకాలు చేసిన అభయ హస్తం కార్డు పేరిట ప్రతి ఇంటికి అందించి నమ్మబలికి ఎన్నికల్లో గెలిచాకా హామిలను అమలు పర్చడం లేదన్నారు. ఎన్నికల సమయంలో దొంగ హామీలు ఇవ్వడం అధికారం లోకి వచ్చాక మర్చిపోవడం కాంగ్రెస్కు పరిపాటిగా మారిందని మండిపడ్డారు. 420 హామీలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్య బట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మి కులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబి డ్డల వివాహానికి తులం బంగారం, పాఠశా లలు, కళాశాలలకు వెళ్లే ఆడ పిల్లలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యా భరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5 లక్షలు ఇస్తామని నమ్మించి మో సం చేశారన్నారు. రాజీవ్ యువ కిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజా ల్లోకి తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రె డెంట్ కేటీఆర్ గారు కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, పార్టీ కార కర్తలు బాకీ కార్డును గడపగడపకూ తీసుకె ప్రజలను చైతన్యం చేయాలని పిలుపు చ్చారు. కాంగ్రెస్ పార్టీ మెసాలను విసిగిపోయిన ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన ను కోరుకుంటున్నారని, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ కి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూల విజయ రెడ్డి గోపు అయిలయ్య యాదవ్ పర్లపల్లి రవి నారాయణదాసు మారుతి చెలకలపల్లి శ్రీనివాస్ కల్వచర్ల తదితరులు పాల్గొన్నారు.

# కుంజా రమాదేవికి బెస్ట్ టీచర్ అవార్డు



- **అవార్డు అందిస్తున్న ఏలూరు కలెక్టర్ వెట్రీ సెల్లి**
- **మారుమూల గ్రామం ఆదివాసి టీచర్ కి బెస్ట్ టీచర్ అవార్డు**

**భద్రాచలం, విశాలభారతి:**

వేలేరు స్కూల్ కుకునూరు మండలం ఏలూరు డిస్టిక్ కు చెందిన ఆదివాసి టీచర్ కుంజా రమాదేవికి బెస్ట్ టీచర్ అవార్డు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్లి చేతుల మీదుగా బహుకరించడం జరిగింది. ఈ బెస్ట్ టీచర్స్ అవార్డు ప్రోగ్రాం ఉద్దేశించి (ఏపీసి) అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామంలో కేజీబీవీ వేలేరు స్కూల్ కుకునూరు మండలం కు చెందిన కుంజా రమాదేవికి బెస్ట్ టీచర్స్ అవార్డు రావడం హర్షం వ్యక్తం చేశారు కుంజా రమదేవి విద్యార్థుల పట్ల ఎంతో శ్రద్ధ వహించి విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమించటం వలన ఈ బెస్ట్ టీచర్ అవార్డు పొందారని ఆయన పేర్కొన్నారు ఒక ఆదివాసి తెగల్లో పుట్టిన ఆమె అంచలంచలుగా ఎదిగి కృషి పట్టుదలతో పనిచేయటం కొనియాడ దగ్గ విషయమని ఆయన అన్నారు. విద్యార్థుల చదువుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల జీవితాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే ప్రయత్నం ఎనలేనిదని ఆయన కొనియాడారు. క్రమశిక్షణ డ్యూటీలపట్ల సమయపాలన పాటిస్తూ తనదైన శైలిలో విద్యా బోధనలు చేయటం ఆమెకు ఆమె చాటి అని చెప్పటం అతిశయోక్తి కాదని ఆయన అన్నారు సమయాన్ని వృధా చేయకుండా ఎక్కువ విద్యార్థుల తోటే గడుపుతూ వారి యొక్క ప్రేమను చురకొన్న ఉపాధ్యాయునిగా మంచి పేరు ప్రఖ్యాతలు ఆమెకు ఉన్నాయని అందుకే బెస్ట్ అవార్డు టీచర్స్ కి ఎన్నికయ్యారని ఆయన అన్నారు. ఎంతో నేర్పుతో ఓర్పుతో విద్యార్థులకు చెరువుగా ఉంటూ విద్యార్థుల్లో ఒకరిగా కలిసిపోయే ఉపాధ్యాయురాలు కుంజా రమాదేవి అని ఆయన గుర్తు చేశారు. విద్యతో పాటు సమాజం యొక్క విలువలను మహనీయుల చరిత్రను ఆమె విద్యార్థులకు బోధిస్తూ విద్యార్థుల జ్ఞానాన్ని మరింతగా పెంపొందే దాంట్లో ఎంతో కృషి చేశారని ఆమె ఇంకా ఎన్నో ఇటువంటి అవార్డులను పొంది ఆదివాసుల ఉపాధ్యాయులకు ఆదర్శం కావాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు ఈ ప్రోగ్రాం లో (డిఇఓ) డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వెంకట నరసమ్మ, జి సి డి ఓ నవీన, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లి మార్కెట్‌లో కందులు రూ.8,500



**ఇప్పటికే సగానికి పైగా అమ్ముకున్న రైతులు**

**మర్పల్లి, విశాలభారతి:**

మండల కేంద్రంలో నీ వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం కందుల ధర ఒక్క క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,500, కనిష్టంగా రూ.7800 పలికింది. గత వారం కందుల కు మార్కెట్ లో క్వింటాల్ కు గరిష్టంగా రూ.7400, కనిష్టంగా 6800 పలికాయి.ఇటీవల ధరలు పెరుగుతుండటంతో రైతులు కొంత ఊరట పొందుతున్నప్పటికీ, ఇప్పటికే సగానికి పైగా పంటను తక్కువ ధరలకు అమ్ముకున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కందుల పంటకు ఈ సీజన్‌లో సాగు ఖర్చులు భారీగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు, రవాణా వ్యయాలు పెరగడంతో రైతులపై భారంగా మారింది. ప్రారంభ దశలో ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, అవసరాల కోసం రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పంటను అమ్ముకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు మార్కెట్‌లో ధర రూ.8,500కి చేరడంతో మిగిలిన పంటను ఇంకా నిల్వ చేసుకున్న రైతులు కొంత లాభం ఆశిస్తున్నారు. ఇంకా ధరలు పెరిగే అవకాశం ఉన్నాయని వ్యాపారాలు అంటున్నారు.అయితే, ఇప్పటికే సగానికి పైగా అమ్ముకున్న రైతులకు మాత్రం ధర పెరుగుదల ఉపయోగం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ప్రభుత్వం ముందస్తుగా మద్దతు ధర ప్రకటించి, కొనుగోళ్లు చేపట్టి ఉంటే రైతులకు మరింత మేలు జరిగేదని అభిప్రాయపడుతున్నారు.మర్పల్లి మార్కెట్‌కు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున కందులు వస్తుండటంతో మార్కెట్ సందడిగా మారింది. వ్యాపారులు మాత్రం తాండూరు మార్కెట్ లో పలికిన ధరలు ,అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డిమాండ్ ఆధారంగా ధరలు నిర్ణయిస్తున్నామని చెబుతున్నారు. రైతులకు న్యాయమైన ధర లభించేలా ప్రభుత్వం మార్కెట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిల్వ సదుపాయాలు, గోదాములు, మార్కెట్ మౌలిక వసతులు మెరుగుపరచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళిక అవసరమని కోరుతున్నారు.

# వాజేడు పోలీస్ స్టేషన్‌ల్లో మిస్ ఫైర్

**ఇద్దరు జవాన్లకు గాయాలు**

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ జవాన్లు గన్నులు క్లీన్ చేస్తుండగా యు జీ బీఎస్ గన్ మిస్ ఫైర్ అయింది భారీ శబ్దం రావడంతో వాజేడు ప్రజలు భయాందోళనకు గురయ్యారు ఎలాంటి ప్రాణహాని జరగలేదు బుల్లెట్ 1 వెంకటసుబ్బయ్య, 2 కోటేశ్వరరావు అనే ఇద్దరు జవాన్లకు తగలడంతో చిన్న చిన్న గాయాలతో భారీ ప్రమాదం నుండి బయటపడ్డారు. ఇది తెలుసుకున్న సిఆర్పిఎఫ్ పోలీసులు వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ములుగు వైద్యశాలకు 108 వాహనం సహాయంతో తరలించారు.

# బంజారా భవన్‌ను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్:** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో సుమారు రూ. 50.00 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బంజారా భవన్‌ను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. భవన నిర్మాణ పనుల నాణ్యత, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కాలనీవాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, సుమారు రూ. 20.00 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడానికి అవసరమైన నిధులు మంజూరయ్యాయని ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీవాసులకు తెలిపారు.ఈ ఓపెన్ జిమ్ ద్వారా యువతతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఆరోగ్యాన్ని కాపాడుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వర్గానికి సమానంగా మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. సామాజిక భవనాల నిర్మాణం, క్రీడా మరియు ఆరోగ్య సదుపాయాల విస్తరణ ద్వారా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, బీజేపీ సీనియర్ నాయకులు జంజ్య నాయక్, బాలు నాయక్, భరత్ నాయక్, కిరణ్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్‌తో పాటు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతతో విద్యా సహకారం

- **150 మంది విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**
- **ముఖ్య అతిథులుగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జక్కిడి రఘువీర్ రెడ్డి దంపతులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** మన్సూరాబాద్ ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ డివిజన్ పరిధిలోని చెన్నగోని స్వామి ఫంక్షన్ హాల్‌లో కేసవ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 39వ వార్షికోత్సవ వేడుకలు నిన్న సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా రఘువీర్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకమైన దశ అని, ఈ సమయంలో చేసే కష్టపడి చదువు, చూపే ఏకాగ్రతే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో, శ్రద్ధ, క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని సూచించారు. అదే విధంగా తమను తీర్చిదిద్దుతున్న కోచింగ్ సెంటర్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు.విద్యా ప్రోత్సాహమే లక్ష్యంగా జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రూపొందించిన 'ఆల్ ఇన్ వన్' పుస్తకాలను కోచింగ్ సెంటర్‌లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పంపిణీ చేశారు. విద్య ద్వారానే సమాజంలో స్థిరమైన మార్పు సాధ్యమవుతుందన్న నమ్మకంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రఘువీర్ రెడ్డి తెలిపారు.అలాగే గత 39 సంవత్సరాలుగా నిరంతరంగా నాణ్యమైన విద్య అందిస్తూ వేలాది మంది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేస్తున్న కేసవ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కేసవ రావుని, ఆయన ధర్మపత్ని స్వప్నని ఆయన అభినందించారు. వారి సేవలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు, ఇతర అతిథులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, యువత, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగల చరిత్ర దాచుకుని దేవాలయాలపై నిందలా?

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న నీచ రాజకీయ దుష్ప్రచారంపై గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఒక పవిత్రమైన దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నాయకుడిపై బురద జల్లే ముందు, మీ నాయకుల చరిత్ర ఏంటో ప్రజలకు చెప్పే ధైర్యం ఉందా? అంటూ పెయిడ్ ఆర్టిస్టులు, భజన బృందాలకు ఘాటైన హెచ్చరిక జారీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బాప్ ఏక్ నంబర్ చోర్... బేటా కా దస్ నంబర్ చోర్ అన్న నానుడి మీ రాజకీయ కుటుంబానికి అచ్చంగా సరిపోతుంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో దేవాలయాల భూములను అమ్ముకొని రాజకీయాలు చేసిన ఘన చరిత్ర మీది. భూకబ్జాలకు, భూబాగోతాలకు మీరు కేరాఫ్ అడ్రస్" అని మండిపడ్డారు. గుడి భూములే కాదు... గుడిలో ఉన్న విగ్రహాలు, గుడి బయట ఉన్న విగ్రహాలు, పక్కన ఉన్న స్థలాల వరకు తవ్వి దోచుకున్న భాగ్యం మీ 'ప్రశాంత' నాయకుడిదని ఎద్దేవా చేశారు. "ఇది ప్రజలు మర్చిపోయిన చరిత్ర కాదు... మీరే మరిచిపోవాలని చూస్తున్న నేర చరిత్ర" అని స్పష్టం చేశారు. అసైన్డ్ భూములు, మైనింగ్ భూములు, భూదాన్ భూములను అక్రమంగా ఆక్రమించి, అప్పటి ప్రభుత్వానికి అప్పనంగా ఇచ్చి వచ్చిన కోట్ల రూపాయలను వ్యక్తిగత ఖాతాల్లో వేసుకున్న చరిత్ర కూడా మీ నాయకులదేనని గుర్తు చేశారు. ఈ అక్రమాలపై ప్రశ్నించిన రైతులకు బేడీలు వేసిన ఘోర పాలన మీది అని, అదే రైతులు ఆ తర్వాత చెప్పులతో తరిమిన సిగ్గుమాలిన సంఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని చిలుక మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రశాంతమైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల భూములు అన్యాక్రాంతం అవుతున్న సమయంలో ప్రజల పక్షాన నిలబడి భూములను కాపాడిన చరిత్ర మాత్రం తమ నాయకుడిదేనని స్పష్టం చేశారు.



"మీ నాయకుడు వేసే ఎంగిలి మెతుకులకు ఆశపడి, ప్రజలను మోసం చేస్తూ పంచిన దొంగ ప్లాట్ల బాగోతాన్ని ఇబ్రహీంపట్నం ప్రజలు ఇంకా మర్చిపోలేదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. అందుకే గత ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం ప్రజలు మీకు కర్రు కాల్చి వాతలు పెట్టారని, దాదాపు 40 వేల ఓట్లతో స్పష్టమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ఇకనైనా భజన రాజకీయాలు మానేసి బతుకులు మార్చుకోకపోతే, ఈసారి పట్నం ప్రజలు మిమ్మల్ని రాజకీయంగా పెద్ద చెరువులో విసిరేయడం ఖాయమని హెచ్చరించారు. భగవంతుడికి సేవ చేసే అవకాశం అందరికీ రాదని, అది కొందరికే దక్కే గొప్ప అదృష్టమని చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు.అలాంటి సేవా గుణం, ధైర్యం, ప్రజలపై ప్రేమ కలిగిన గొప్ప మనస్సు ఇబ్రహీంపట్నం ప్రజల గుండె ధైర్యంగా నిలిచిన నాయకుడు తమ స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అని స్పష్టంగా ప్రకటించారు.



# విజయ్ సేతుపతి 'గాంధీ టాక్స్' ట్రైలర్ రిలీజ్

కమల్ హాసన్ 'పుష్పక విమానం' మూకీ సినిమా అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చి ఏ విధంగా మంత్రముగ్ధులను చేసిందో మనందరికీ తెలిసిందే. అయితే మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత అదే స్థాయిలో భావోద్వేగాలను పండించడానికి 'గాంధీ టాక్స్' అనే మూకీ డ్రామా సిద్ధమైంది. విలక్షణ నటుడు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించబోతున్నారు. ఈ సినిమాలో మాటలు లేకపోయినా, కేవలం నటీనటుల హావభావాలు మరియు సంగీతంతోనే కథను ప్రేక్షకుల హృదయాలకు చేరువ చేసేలా ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది.ఇది మూకీ సినిమా అయినప్పటికీ.. తెలుగు, తమిళం, హిందీ, మరాఠీ మరియు మలయాళ భాషల్లో టైటిల్ కార్డులు, ప్రమోషన్లతో గ్రాండ్‌గా విడుదల కానుంది. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామిలతో పాటు అందాల నటి అదితి రావు హైదరి, మరాఠీ నటుడు సిద్ధార్థ్ జాదవ్ కీలక పాత్రల్లో నటించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Madarapu Ashok. RNI No APTEL/2010/32877.